


EVENING EDITION
నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
4PM
www.suryaa.com
బుధవారం
11-02-2026
పేజీలు: 02





## 11 గంటల వరకు 28.48 శాతం పోలింగ్ నమోదు..
# టాప్‌లో ఐజా మున్సిపాలిటీ

రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల ఓటింగ్ ప్రక్రియ కొనసాగుతోంది. ఉదయం 11 గంటల వరకు సగటున 28.48 శాతం పోలింగ్ నమోదైంది. మొత్తం 52,17,413 మంది ఓటర్లలో 14,85,767 మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఉదయం 11 గంటల వరకు డేటా ప్రకారం జోగులాంబ గద్వాల జిల్లా ఐజా మున్సిపాలిటీలో అత్యధికంగా 47.52 శాతం పోలింగ్ నమోదైంది. ఆ తర్వాత వడ్డేపల్లిలో 46.61 శాతం పోలింగ్ నమోదైంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలో 45.18 శాతం, ఖమ్మం జిల్లా కల్లూరు మున్సిపాలిటీలో 45.05 శాతం పోలింగ్ రికార్డయ్యింది. ఇదిలా ఉంటే.. మున్సిపల్ ఎన్నికల సందర్భంగా పలు చోట్ల ఉద్రిక్త వాతారణం నెలకొంది. మెదక్ జిల్లా నర్సాపూర్ మున్సిపాలిటీలో బీఆర్ఎస్ కార్యకర్తలపై బీజేపీ నేతలు దాడికి దిగారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ కార్యకర్తలు ప్రతిఘటించారు. ఇరు పార్టీల నేతలు గల్లాలు పట్టుకుని కొట్టుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని ఇరు పార్టీల వారిని చెదరగొట్టారు. మరోవైపు మహబూబాబాద్ మున్సిపాలిటీలోని 14వ వార్డులో పోలింగ్ కేంద్రం వద్ద కాంగ్రెస్ అభ్యర్థి నాగేశ్వరరావు ప్రచారం నిర్వహించారు. దీన్ని బీఆర్ఎస్ అభ్యర్థి కృష్ణ అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఇరు పార్టీల మధ్య ఘర్షణ నెలకొంది. ఇది గమనించిన పోలీసులు ఇరు వర్గాలను అక్కడి నుంచి చెదరగొట్టారు. మంచిర్యాల జిల్లాలోని



పోలింగ్ కేంద్రాల వద్ద ప్రతిపక్ష బీఆర్ఎస్ ఏజెంట్‌లను లక్ష్యంగా చేసుకుని పోలీసులతో దౌర్జన్యం చేయిస్తోంది. బీఆర్ఎస్ ఏజెంట్‌లను పోలింగ్ బూత్‌ల లోపలికి వెళ్లకుండా అడ్డుకుంటోంది. లక్సెట్టిపేట మున్సిపాలిటీ పరిధిలోని 9వ, 10వ పోలింగ్ కేంద్రాల దగ్గర బీఆర్ఎస్ ఏజెంట్‌గా ఉన్న మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్‌ను పోలింగ్ బూత్ లోపలికి వెళ్లకుం పోలీసులు అడ్డుకున్నారు. ఆయన ఎందుకు అడ్డుకుంటున్నారని ప్రశ్నించడంతో పోలింగ్ కేంద్రం ఆవరణ నుంచి పక్కకు ఈడ్చుకెళ్లారు. పోలీసుల తీరును నిరసిస్తూ ఆయన పోలింగ్ కేంద్రం ఎదురుగా రోడ్డుపై బైఠాయించారు. కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మున్సిపల్ ఎన్నికల్లో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. అధికార పార్టీ ఎమ్మెల్యే మదన్ మోహన్ రావుకు పోలీసులు వత్తాసు



పలుకుతున్నారని ఆరోపిస్తూ ఎల్లారెడ్డి పట్టణంలో బీఆర్ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ ఆందోళన చేపట్టారు. రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. మహబూబ్‌నగర్‌లోని 45వ డివిజన్‌లో బ్యాలెట్ పేపర్‌లో అభ్యర్థుల సీరియల్ నంబర్లు, గుర్తులు తారుమారయ్యాయి. ముందుగా ఇచ్చిన నమూనా బ్యాలెట్‌లో ముందు ప్రధాన పార్టీల గుర్తులు.. ఆ తర్వాత జనసేన, ఇతర పార్టీల గుర్తులను ఇచ్చారు. కానీ అనూహ్యంగా పోలింగ్ రోజు ఇచ్చిన బ్యాలెట్‌లో జనసేన పార్టీకి ఒకటో నంబర్ ఇచ్చారు. దీంతో ప్రధాన పార్టీల గుర్తులన్నీ మారిపోయాయి. ఎన్నికలు ప్రారంభమయ్యాక ఇది గమనించిన అభ్యర్థులు ఆందోళన చేపట్టారు. దీంతో 20 నిమిషాల పాటు పోలింగ్ నిలిచిపోయింది. అభ్యర్థుల ఆందోళనతో రంగంలోకి దిగిన అధికారులు అభ్యర్థులతో చర్చించారు. సమన్వయంతో ఓటింగ్ ప్రక్రియను పున:ప్రారంభించారు. మున్సిపల్ ఎన్నికల వేళ జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని పోలింగ్ కేంద్రం సమీపంలో రూ.లక్ష రూపాయలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. 22వ వార్డులోని పోలింగ్ కేంద్రం సమీపంలోని ఒక బండ కింద డబ్బులు దాచి, ఓటర్లకు పంచుతున్నారని కాంగ్రెస్ నాయకులు ఆందోళన చేశారు. ఈ క్రమంలో కాంగ్రెస్ నాయకుల చేతిలో ఉన్న డబ్బును పోలీసులు సీజ్ చేశారు. బీఆర్ఎస్ నాయకులు ఈ డబ్బులను పంచుతున్నారని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. బీఆర్ఎస్ అభ్యర్థి బుర్రా సదానందాన్ని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కాగా, కాంగ్రెస్ ఆరోపణలను బీఆర్ఎస్ నాయకులు తీవ్రంగా ఖండించారు. పట్టుబడిన సొమ్ముతో తమకెలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. కావాలనే రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు. రాకాసిపేట్‌లోని బూత్ నంబర్ 24, గోశాల ప్రాంతంలోని బూత్ నంబర్ 78లో వేరే వాళ్ల పేర్లతో ఓటు వేసేందుకు ఇద్దరు వ్యక్తులు వచ్చారు. అయితే ఓటర్ గుర్తింపు కార్డులను తనిఖీ చేస్తున్న సమయంలో తప్పుడు గుర్తింపు పత్రాలను చూపించారు.
ఈ క్రమంలో వారి కదలికలపై అనుమానం వచ్చిన పోలింగ్ ఏజెంట్లు, ఎన్నికల సిబ్బంది నిలదీయడంతో దొంగ ఓట్లు వేసేందుకు వచ్చినట్లుగా వెల్లడించారు.



### ఎల్లారెడ్డిలో ఉద్రిక్తత.. రోడ్డుపై బైఠాయించిన
## మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్

కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మున్సిపల్ ఎన్నికల్లో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. అధికార పార్టీ ఎమ్మెల్యే మదన్ మోహన్ రావుకు పోలీసులు వత్తాసు పలుకుతున్నారని ఆరోపిస్తూ ఎల్లారెడ్డి పట్టణంలో బీఆర్ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ ఆందోళన చేపట్టారు. రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఎన్నిక సందర్భంగా కాంగ్రెస్ పార్టీకి పోలీసులు వత్తాసు పలుకుతున్నారని జాజాల సురేందర్ ఆరోపించారు. డీఎస్పీ, సీఐ, ఎస్సై మూకుమ్మడిగా ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేకు మద్దతు తెలుపుతున్నారని, ఎన్నికల ప్రక్రియను అపహాస్యం చేస్తున్నారని మండిపడ్డారు. కాగా, బీఆర్ఎస్ నిరసనను పోలీసులు అడ్డుకున్నారు. ఆందోళన చేస్తున్న జాజాల సురేందర్, ఇతర బీఆర్ఎస్ నాయకులను అరెస్టు చేసి ఇతర ప్రాంతాలకు తరలించారు.



## నర్సాపూర్‌లో ఉద్రిక్తత.. తన్నుకున్నబీజేపీ, బీఆర్ఎస్ కార్యకర్తలు

మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఉమ్మడి మెదక్ జిల్లా నర్సాపూర్ మున్సిపాలిటీలో తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. రాజకీయ కారణాలతో 15వ వార్డులో బీజేపీ, బీఆర్ఎస్ కార్యకర్తల మధ్య ఘర్షణ తలెత్తింది. దీంతో ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు చొక్కాలు పట్టుకుని కొట్టుకున్నారు. రోడ్డుపైనే పిడిగుద్దులు గుద్దుకుంటూ తన్నుకున్నారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఇరు వర్గాలను చెదరగొట్టారు. ఈ ఘర్షణకు గల కారణాలు తెలియాల్సి ఉంది. ఈ గొడవలో ఇరు పార్టీలకు చెందిన పలువురు కార్యకర్తలు గాయాలపాలయ్యారు.



## భారత్‌కు మరో 114 రఫేల్ యుద్ధ విమానాలు

భారత గగనతల రక్షణ కవచం మరింత పటిష్టం కాబోతోంది. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ ఢిల్లీ పర్యటనకు ముందే.. భారత రక్షణ శాఖ ఒక చారిత్రక నిర్ణయానికి సిద్ధమైంది. సుమారు రూ.3.25 లక్షల కోట్ల వ్యయంతో.. 114 రఫేల్ మల్టీ రోల్ యుద్ధ విమానాలను కొనుగోలు చేసేందుకు కేంద్రం ఈ వారంలోనే గ్రీన్ సిగ్నల్ ఇవ్వబోతున్నట్లు తెలుస్తోంది. ఇదే కనుక జరిగితే భారత రక్షణ చరిత్రలోనే ఇది అతిపెద్ద ఆయుధ ఒప్పందంగా మారుతుంది.

**'మేక్ ఇన్ ఇండియా'కు భారీ ఊతం**

ఈ ఒప్పందం ప్రకారం.. 114 విమానాల్లో సుమారు 100 విమానాలను భారత్‌లోనే తయారు చేస్తారు. దీని కోసం ఫ్రాన్స్‌కు చెందిన డస్సాల్ట్ ఏవియేషన్, భారతీయ దిగ్గజం టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం కుదిరినట్లు సమాచారం. అత్యాధునిక యుద్ధ విమానాల సాంకేతిక పరిజ్ఞానాన్ని భారత్‌కు బదిలీ చేయడంతో పాటు హైదరాబాద్‌లో వీటి విడిభాగాల తయారీ కోసం ఒక అత్యాధునిక కేంద్రాన్ని ఏర్పాటు చేయబోతున్నారట. ఇదే కనుక జరిగితే 2028 నాటికి ఇక్కడి నుంచే మొదటి ఫ్యూజ్‌లేజ్ (విమాన మధ్య భాగం) సిద్ధం కానుంది. ముఖ్యంగా టాటా-డస్సాల్ట్ ఒప్పందంలో భాగంగా హైదరాబాద్‌లోని ప్లాంట్‌లో విమానం వెనుక భాగం, సెంట్రల్ ఫ్యూజ్‌లేజ్ ముందు భాగాలను తయారు చేస్తారు. నెలకు రెండు పూర్తిస్థాయి ఫ్యూజ్‌లేజ్‌లను తయారు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. తుది అసెంబ్లీ మాత్రం ఫ్రాన్స్‌లోని మెరిగ్నాక్ ప్లాంట్‌లో జరుగుతుంది.

## ఇప్పుడు కూడా ఫోన్ ట్యాపింగ్ జరుగుతోంది
### మంత్రి పొంగులేటి




ఫోన్ ట్యాపింగ్ కేసు తెలంగాణ రాజకీయాల్లో పెను సంచలనంగా మారిన సంగతి తెలిసిందే. ఈ కేసులో అప్పటి అధికారులతోపాటు గత ప్రభుత్వం ప్రతిపక్షాలు, జర్నలిస్టులు, సినిమా సెలబ్రిటీల ఫోన్లను ట్యాప్ చేసిందంటూ అధికార కాంగ్రెస్ పార్టీ కేసు నమోదు చేసి విచారణ జరిపిస్తోంది. ఈ ఫోన్ ట్యాపింగ్ కేసును తీవ్రంగా పరిగణించిన రేవంత్ రెడ్డి సర్కార్.. విచారణ కోసం స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (సిట్)ను కూడా ఏర్పాటు చేసింది. ఈ సిట్ గతంలో పనిచేసిన అధికారులతోపాటు బీఆర్ఎస్ నేతలు కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు, సంతోష్ రావులను విచారణ జరిపింది. ఈ నేపథ్యంలోనే ఈ ఫోన్ ట్యాపింగ్ కేసు గురించి తాజాగా తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. గతంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ చేసిన అక్రమ ఫోన్ ట్యాపింగ్‌ను.. ఇప్పటికీ ఆ పార్టీ నేతలు కొనసాగిస్తూనే ఉన్నారని మంత్రి పొంగులేటి ఆరోపించారు. బీఆర్ఎస్ నేతలు ఇంకా ఫోన్ ట్యాపింగ్ చేస్తున్నారనే అనుమానం ఉందని తెలిపారు. కొంతమంది వ్యక్తులు చట్టవిరుద్ధంగా ఇతరుల పర్సనల్ సంభాషణలను వింటున్నారని.. ప్రజాస్వామ్యంలో ఇది తీవ్ర నేరంగా పరిగణిస్తారని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. టెక్నాలజీని తప్పుడు విధానాలకు ఉపయోగిస్తూ.. రాజ్యాంగ విరుద్ధమైన చర్యలకు పాల్పడుతున్నారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే తాను కేవలం ఆరోపణలు మాత్రమే కావని పేర్కొన్న పొంగులేటి.. తాను ఖమ్మం జిల్లా ఉద్యోగ సంఘాల నేతలతో మాట్లాడిన ఫోన్ కాల్ వివరాలు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతామధుకు ఎలా తెలిశాయని ప్రశ్నించారు. ఇప్పటికీ బీఆర్ఎస్ ఫోన్ ట్యాపింగ్ చేస్తుంది అనడానికి ఇదే సాక్ష్యమని తెలిపారు. తమ సొంత పార్టీ కార్పొరేటర్లతో తాను నిర్వహించిన కాన్ఫరెన్స్ కాల్‌లో తాను ఏం మాట్లాడాను అనేది ట్యాపింగ్ చేసి విన్నారని ఆరోపించారు. తాను ఉద్యోగ సంఘం నేతలతో మాట్లాడిన మాటలను వారు ఎలా విన్నారో విచారణ చేస్తామని వెల్లడించారు. బీఆర్ఎస్ అగ్రనేతల వద్ద ఇంకా ఫోన్ ట్యాపింగ్ చేసే డివైజ్‌లు ఉన్నాయని పొంగులేటి ఆరోపించారు. ఈ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాన్ని తమ కాంగ్రెస్ ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంటుందని మంత్రి పొంగులేటి తెలిపారు. గులాబీ నేతలు ఏ మామిడి తోటల్లోనో.. ఫామ్‌హౌస్‌లలోనో ఫోన్ ట్యాపింగ్ డివైజ్‌లను పెట్టి.. అక్రమంగా ఫోన్ కాల్స్ రికార్డ్ చేస్తున్నారని.. వాటిపై దర్యాప్తు చేపట్టి.. నిందితులను గుర్తించి.. వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఆయన తీవ్ర హెచ్చరికలు చేశారు.



## గ్లామర్ లుక్‌లో కాజల్ అగర్వాల్

కాజల్ అగర్వాల్ సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉంటుంది. నటి తన అభిమానులకు అప్‌డేట్ చేయడానికి తన తాజా ఫోటోలు మరియు వీడియోలను షేర్ చేస్తూనే ఉంటుంది.కాజల్ పోస్ట్‌లను అభిమానులు చాలా ఇష్టపడతారు మరియు యూజర్లు కూడా ఆమెపై చాలా ప్రేమను కురిపిస్తారు.ఇటీవల, ఆమె తన సోషల్ మీడియాలో తన తాజా ఫోటోలను షేర్ చేసింది, ఇవి ఇంటర్నెట్‌లో ట్రెండింగ్‌లో ఉన్నాయి.కాజల్ అగర్వాల్ ఇటీవల తన ఇన్‌స్టాగ్రామ్‌లో తన తాజా ఫోటోలను షేర్ చేసింది. ఈ ఫోటోలలో నటి యొక్క విభిన్న లుక్‌ను చూడవచ్చు.కాజల్ అగర్వాల్ సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉంటుంది. ఆమె అందమైన చిత్రాలతో పాటు, ఆమె తన కుటుంబ ఫోటోలను కూడా చాలా షేర్ చేస్తూనే ఉంటుంది.

నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM




## కర్ణాటక మైసూర్ శాండల్ సోప్ బ్రాండ్ అంబాసిడర్‌గా తమన్నా

ప్రఖ్యాత కర్ణాటక సోప్స్ అండ్ డిటర్జెంట్స్ లిమిటెడ్ ఉత్పత్తి చేసే ఐకానిక్ మైసూర్ శాండల్ సోప్ వంటి హెరిటేజ్ ఉత్పత్తుల కోసం.. సినీ నటి తమన్నా భాటియాను బ్రాండ్ అంబాసిడర్‌గా అధికారికంగా నియమించినట్లు కర్ణాటక ప్రభుత్వం మంగళవారం ప్రకటించింది. ఆమె ఈ బాధ్యతను ఫిబ్రవరి 10, 2026 నుంచి రెండు సంవత్సరాల పాటు నిర్వహించనున్నారు. ఈ నిర్ణయంలో భాగంగా మైసూర్ శాండల్ సోప్‌కి సరికొత్త ప్యాకేజింగ్‌తో రీ లాంచ్ కూడా నిర్వహిస్తున్నారు. దీనితో ప్రొడక్ట్ మార్కెట్ విజిబిలిటీ పెంపొందించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు అధికారులు తెలిపారు.



## కందుల దుర్గేష్‌ను చంపేస్తాం.. మావోయిస్టుల సంచలన లేఖ!

ఏపీ మంత్రి కందుల దుర్గేష్‌కు మావోయిస్టుల పేరుతో బెదిరింపు లేఖ రావడం కలకలం రేపింది. మావోయిస్టుల పేరుతో సచివాలయంలోని మంత్రి పేషీకి ఓ లేఖ వచ్చింది. ఇందులో మంత్రి కందుల దుర్గేష్‌ను కుటుంబంతో సహా చంపేస్తామని పేర్కొన్నారు. ఈ లేఖపై తూళ్లురు పోలీస్ స్టేషన్‌లో మంత్రి ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. అసలు ఈ లేఖ నిజంగానే మావోయిస్టులు రాశారా ? ఎవరైనా కావాలనే భయపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కందుల దుర్గేష్ ప్రస్తుతం సినిమాటోగ్రఫీ, పర్యాటక శాఖల మంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. బెదిరింపు లేఖ నేపథ్యంలో మంత్రి భద్రత విషయంలో పోలీసులు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు.



## మారిన 'వందేమాతరం' నియమాలు

''వందేమాతరం'' కు సంబంధించి కేంద్ర ప్రభుత్వం కొత్త అధికారిక మార్గదర్శకాలను జారీ చేసింది. ఈ ఆదేశాలు జనవరి 28, 2026 నుంచి అమలులోకి వచ్చాయి. ఈమేరకు అధికారిక ప్రభుత్వ ఉత్తర్వులు వెలువడ్డాయి. జాతీయ గీతం కోసం ఇప్పటికే ఏర్పాటు చేసిన మాదిరిగానే, వందేమాతరం గీతం పాడటం, ప్రదర్శన కోసం స్పష్టమైన ప్రోటోకాల్‌లను పాటించాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

హోం మంత్రిత్వ శాఖ మార్గదర్శకాలు ఏమిటి ?

కొత్త మార్గదర్శకాల ప్రకారం, ఏదైనా ప్రభుత్వ లేదా అధికారిక కార్యక్రమంలో 'వందేమాతరం' పాడినా లేదా ప్లే చేసినా, దాని పూర్తి ఆరు చరణాలకు ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉంటుంది.

ఇప్పటివరకు, మొదటి రెండు చరణాలు మాత్రమే పాడేవారు, కానీ కొత్త మార్గదర్శకాల ప్రకారం పూర్తి ఆరు చరణాలు పాడాల్సిందే.. ఆచరణాత్మక పరిస్థితుల ప్రకారం ప్రదర్శన, ఆకృతిని నిర్ణయించవచ్చని స్పష్టం చేసినప్పటికీ, మొత్తం పాటను అధికారికంగా ప్రామాణికంగా పరిగణిస్తారు.

ప్రస్తుతం, ప్రత్యేక ప్రభుత్వ కార్యక్రమాలలో, వందేమాతరం అధికారిక ఆరు చరణాలను పాడటం లేదా ప్లే చేయడం తప్పనిసరి. దీని వ్యవధి 3 నిమిషాల 10 సెకన్లుగా నిర్ణయించారు.

ఒక కార్యక్రమంలో 'వందేమాతరం', 'జన గణ మన' రెండూ ప్రదర్శించినట్లతే, ముందుగా 'వందేమాతరం' ప్రదర్శించిన తరువాత జాతీయ గీతం 'జన గణ మన' ప్రదర్శించాల్సి ఉంటుంది. అధికారిక కార్యక్రమాలలో ఏకరూపతను నిర్ధారించడానికి ఈ ఆదేశం ఇప్పుడు అధికారికంగా నిర్ణయించారు.

గౌరవం , మర్యాదలు (ప్రోటోకాల్) కూడా జాతీయ గీతం ఆలపించేటప్పుడు ఉన్నట్లుగానే, ''వందేమాతరం'' పాడేటప్పుడు లేదా వాయించేటప్పుడు హాజరైన వారు గౌరవంగా నిలబడాలని నిర్దేశించారు. జాతీయ గీతం పట్ల సమాన గౌరవాన్ని నిర్ధారించడానికి దీనిని ఉద్దేశించారు.

త్రివర్ణపతాకాన్ని ఎగురవేయడం, రాష్ట్రపతి కార్యక్రమాలకు రాక, రాష్ట్రపతి ప్రసంగాలు, దేశాన్ని ఉద్దేశించి ప్రసంగించే ముందు, తరువాత, అలాగే గవర్నర్లరాక, గవర్నర్ ప్రసంగాలకు ముందు, తరువాత వంటి అనేక అధికారిక సందర్భాలలో వందేమాతరం పాడాల్సిందే.

### మున్సిపల్ ఎన్నికల్లో ఉద్రిక్తతలు..

# పలు పోలింగ్ కేంద్రాల్లో ఘర్షణలు

తెలంగాణ రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ బుధవారం ఉదయం 7 గంటలకు ప్రారంభమైంది. సాయంత్రం 5 గంటల వరకు జరగనుంది. పోలింగ్ కొనసాగుతున్న వేళ పలు జిల్లాల్లో స్వల్ప ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి. మహబూబాబాద్, నిజామాబాద్, మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో కార్యకర్తల మధ్య ఘర్షణలు, నినాదాలు, దొంగ ఓట్ల యత్నాలు వంటి ఘటనలు వెలుగుచూశాయి. పోలీసులు వేగంగా స్పందించి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు.



**మహబూబాబాద్‌లో**
**కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తల ఘర్షణ**

మహబూబాబాద్ పట్టణంలోని 32, 33 పోలింగ్ బూత్‌ల వద్ద స్వల్ప ఘర్షణలు జరిగాయి. 14వ వార్డులో పోటీలో ఉన్న కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థుల కార్యకర్తల మధ్య తోపులాట చోటుచేసుకుంది. ఇరువర్గాలు పరస్పరం ఆరోపణలు చేసుకుంటూ ఘర్షణకు దిగాయి.

పరిస్థితి ఉద్రిక్తం..

కాంగ్రెస్ కార్యకర్తలపై బీఆర్ఎస్ కార్యకర్తలు దాడి చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ ఘటనతో పోలింగ్ కేంద్రాల వద్ద ఉద్రిక్తత పెరిగింది. సమాచారం అందుకున్న వెంటనే భారీగా పోలీసులు అక్కడికి చేరుకుని ఇరువర్గాలను చెదరగొట్టారు.

భారీగా పోలీసుల మోహరింపు

పరిస్థితి అదుపులోకి తీసుకొచ్చేందుకు 14వ వార్డులో భారీగా పోలీసులను మోహరించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అధికారులు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. ప్రస్తుతం పోలింగ్ ప్రశాంతంగా కొనసాగుతోందని అధికారులు తెలిపారు.

**నిజామాబాద్ జిల్లాలో..**

నిజామాబాద్ జిల్లాలో బుధవారం ఉదయం 9 గంటల వరకు 14 శాతం పోలింగ్ నమోదైంది. నగరంలోని కోటగల్లీ 25వ డివిజన్‌లో స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. బీజేపీ, కాంగ్రెస్ నేతలు పరస్పరం నినాదాలు చేసుకోవడంతో కాసేపు ఉద్రిక్తత నెలకొంది. పరిస్థితిని గమనించిన పోలీసులు.. వెంటనే అక్కడికి చేరుకుని ఇరువర్గాలను చెదరగొట్టారు. పెద్ద ఘటనలు జరగకుండా అప్రమత్తంగా వ్యవహరించారు.

బోధన్‌లో నినాదాలు..

బోధన్ పట్టణంలో ఎంఐఎం, బీఆర్ఎస్ కార్యకర్తలు పరస్పరం నినాదాలు చేస్తూ ఉద్రిక్త వాతావరణం సృష్టించారు. పోలీసులు వెంటనే జోక్యం చేసుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు.

దొంగ ఓట్ల యత్నం..

నిజామాబాద్ జిల్లాలోని రాకాసిపేట్ పోలింగ్ కేంద్రంలో ఇద్దరు వ్యక్తులు దొంగ ఓట్లు వేసేందుకు ప్రయత్నించిన ఘటన వెలుగులోకి వచ్చింది. పోలింగ్ సిబ్బంది అప్రమత్తంగా ఉండటంతో వారిని అడ్డుకుని కేసు నమోదు చేశారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘనపై చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు.

మెదక్ జిల్లాలోనూ స్వల్ప ఉద్రిక్తత..

మెదక్ జిల్లా నర్సాపూర్ మున్సిపాలిటీలోని 15వ వార్డులోనూ స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. పోలింగ్ కేంద్రానికి వెళ్తున్న ఓటర్లను ప్రలోభపెడుతున్నారంటూ బీజేపీ, బీఆర్ఎస్ కార్యకర్తల మధ్య వాగ్వాదం జరిగింది.

బాహాబాహీ..

బీజేపీ, బీఆర్ఎస్ ఇరువర్గాల మధ్య బాహాబాహీ చోటుచేసుకోవడంతో కాసేపు ఉద్రిక్తత నెలకొంది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని ఇరువర్గాలను చెదరగొట్టారు. ప్రస్తుతం పరిస్థితి అదుపులో ఉందని అధికారులు తెలిపారు.

సంగారెడ్డి జిల్లాలో దొంగ ఓటు యత్నం..

సంగారెడ్డి జిల్లాలోని 28వ వార్డు పోలింగ్ కేంద్రంలో ఓ వ్యక్తి దొంగ ఓటు వేయడానికి ప్రయత్నించాడు. అప్పటికే మరో పోలింగ్ కేంద్రంలో ఓటు వేసిన సదరు వ్యక్తి.. 28వ వార్డులో మరోసారి ఓటు వేసేందుకు వచ్చినట్లు గుర్తించారు. అభ్యర్థులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో పోలింగ్ అధికారులు వెంటనే చర్యలు తీసుకున్నారు. ఆ వ్యక్తి చేతి వేలికి సిరా గుర్తువేసి పోలింగ్ కేంద్రం నుంచి పంపించారు. చట్టపరంగా ఆ వ్యక్తిపై తదుపరి చర్యలు తీసుకుంటామని ఎన్నికల అధికారులు తెలిపారు.

## కుర్రకారుకు పిచ్చెక్కిస్తున్న కేట్ శర్మ

బికినీలో తన నాజూకు అందాలను హైలైట్ చేస్తూ కుర్రకారు మతిపోగొడుతోంది ఈ ముద్దుగుమ్మ. కేట్ శర్మ ఇన్ స్టాగ్రామ్ లో షేర్ చేసిన క్షణాల్లో వైరల్ అయ్యాయి. ఈ పిక్స్ చూసిన వారంతా హాట్, ఉఫ్, స్టన్నింగ్ అంటూ కామెంట్లు పెడుతున్నారు. కొద్ది గంటల్లోనే ఫొటోలకు లక్షల్లో లైకులు వచ్చాయి.సోషల్ మీడియాలో ఎల్లప్పుడూ ఫుల్ యాక్టీవ్ కనిపించే కేట్ శర్మ.. తరచు నెట్టింట బోల్డ్ ఫొటో షూట్లతో ఆకట్టుకుంటూ ఉంటుంది.కేట్ శర్మ జూలై 19, 1997న భారతదేశంలోని మహారాష్ట్రలోని ముంబైలో జన్మించింది. రూహ్‌దార్ , పరమావతార్ శ్రీ కృష్ణ, తు మేరీ జిందగీ వంటి చిత్రాలతో నటిగా గుర్తింపు తెచ్చుకుంది.సినిమాల్లో పెద్దగా కనిపించక పోయినా.. సోషల్ మీడియాలో తన గ్లామరస్ ఫోజులతో కుర్రకారును ఫిదా.





## అసెంబ్లీ ఎదుట జగన్ నిరసన

వైసీపీ అధినేత వైఎస్ జగన్ ఏపీ అసెంబ్లీ ఎదుట నిరసనకు దిగారు. వైసీపీకి ప్రధాన ప్రతిపక్ష హోదా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ రోజు ఏపీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో వైఎస్ జగన్ సహా వైసీపీ ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలంతా సమావేశాలకు హాజరయ్యారు. సభ ప్రారంభమైన కొద్ది సేపటికే వైసీపీ సభ్యులు సభలో నిరసన వ్యక్తం చేశారు. గవర్నర్ ప్రసంగాన్ని అడ్డుకుంటూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం కొద్ది సేపటికే సభ నుంచి వైసీపీ సభ్యులు వాకౌట్ చేశారు. అసెంబ్లీ ఎదుట సైతం జగన్ సహా వైసీపీ సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. ప్లకార్డులు పట్టుకొని నినాదాలు చేశారు. ప్రధాన ప్రతిపక్షంగా గుర్తింపునివ్వరని, కుప్పకూలిన శాంతి భద్రతలపై ప్రశ్నించనివ్వరని పేర్కొన్నారు.

## జలమండలికి ముగ్గురు ఈడీలు




హైదరాబాద్ జలమండలి పరిధి విస్తరించిన నేపథ్యంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. విస్తరించిన ప్రాంతాల నిర్వహణను సమర్థవంతంగా చేపట్టేందుకు ముగ్గురు అధికారులను ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అదే విధంగా ప్రస్తుతం ఈడీగా పని చేస్తున్న అధికారికి పదోన్నతి కల్పించింది. పంకజ ప్రస్తుతం జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్‌గా ఉన్నారు. ఆమెను జలమండలిలో మల్కాజిగిరి ఈడీగా నియమించారు. సామ్రాట్ అశోక్ కు జలమండలి హైదరాబాద్ ఈడీగా పోస్టింగ్ ఇచ్చారు. జలమండలి సైబరాబాద్ ఈడీగా సంతోష్‌ను నియమించారు. ఇక ప్రస్తుతం జలమండలిలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న మయాంక్ మిట్టల్‌కు పదోన్నతి కల్పిస్తూ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమించారు. జలమండలి పరిధి విస్తరణతో హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి ప్రాంతాల్లో తాగునీరు, మురుగు నీటి నిర్వహణ, కొత్త కనెక్షన్లు, మౌలిక వసతుల అభివృద్ధి వంటి పనులు పెరగనున్నాయి. ఈ నేపథ్యంలో పరిపాలనా సామర్థ్యాన్ని పెంచేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.